ప్రకాష్ విద్యాసంస్థల అధినేతకు అభినందన

ప్రజాశక్తి - శంఖవరం

ప్రకాష్ విద్యా సంస్థల అధినేత విజయ్ ప్రకాష్‌ను అన్నవరం దేవస్థానం ఇఇ వి.రామకృష్ణ అభినందించారు. కార్తీక మాసం సందర్భంగా పడమట రాజగో పాల్ నుంచి హరిహరసదనకు మధ్య యాత్రికులు ఉచితంగా రాకపోకలు సాగించేందుకు ప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన బస్సులను అందించారు. ఈ సందర్భంగా విజయ్ ప్రకాష్‌కి కృతజ్ఞతగా ఇఇ రామకృష్ణ దేవస్థానం తరపున స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు.

విజయ్‌ప్రకాష్‌ను అభినందిస్తున్న దేవస్థానం ఇఇ

మండలి విజేత ఎవరు?

- నేడు టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్
- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఫలితాలపై అందరిలోనూ ఉత్కంఠ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాల కోసం 6 జిల్లాల ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మండలి పోరులో గెలిచేదెవరంటూ చర్చలు జరుగుతున్నాయి. ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ సోమవారం జరుగనుంది. కాకినాడ జెఎన్‌టియు ఆవరణలో ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుంది. ఉభయ గోదావరి జిల్లాల్లోని 116 కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 16,737 మంది ఓటర్లుగాను 15,502 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

భారీ భద్రత నడుమ కౌంటింగ్

కౌంటింగ్ కేంద్రవం వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బ్యాక్సులను అత్యంత భద్రతా ఏర్పాట్లతో గురువారం రాత్రి కాకినాడ జెఎన్‌టియులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి భద్రపరిచారు. అక్కడ సాయుధ దళాలు, సిసి కెమెరాల నిఘాతో పటిష్టమైన రక్షణ చేర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షన్‌మోహన్ సగిలి ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్ జరుగ నుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మొత్తం ఐదుగురు అభ్యర్థులు బరిలో ఉండడం కౌంటింగ్ ప్రక్రియ త్వరగానే పూర్తి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

లెక్కింపు ప్రక్రియ ఇలా...

రిటర్నింగ్ అధికారి, ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థుల సమక్షంలో సోమవారం ఉదయం 6.30 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ను తెరుస్తారు. బ్యాలెట్ బాక్సలను కౌంటింగ్ కేంద్రాలకు తరలించి ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభిస్తారు. దీని కోసం 14 కౌంటింగ్ టేబుళ్ళను ఏర్పాటు చేశారు. మొత్తం 9 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మెయిన్ కౌంటింగ్ రెండు రౌండ్లలో పూర్తి చేస్తారు. దాదాపు 140 మంది సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొంటారు. బ్యాలెట్ బాక్సులను ముందుగా ఏజెంట్లచే పరిశీలన చేసి వారి సంతకం తీసుకున్న తర్వాతే తెరుస్తారు. లెక్కింపు కేంద్రంలోకి వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, పెన్నులు, పుస్తకాలను తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. ఏజెంట్లకు ఎన్నికల అధికారులే పెన్సిల్, నోట్‌బుక్‌లను అందిస్తారు. ఒక్కో టేబుల్‌పై బ్యాలెట్ పత్రాలను ఉంచిన అనంతరం 25 బ్యాలెట్ పత్రాలకు ఒకటి చొప్పున కట్ట కడతారు. కట్ట కట్టిన బ్యాలెట్ పత్రాలను తెరిచి అందులో చెల్లనివి, చెల్లుబాటయ్యే ఓట్లను వేరు చేస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. ఇలా 14 టేబుళ్లపైనా ఏకకాలంలో ప్రక్రియ జరుగుతుంది. టేబుల్‌కు వేయి చొప్పున 14 వేల ఓట్లను ఏకకాలంలో లెక్కిస్తారు. డౌట్ ఉన్న ఓట్లను ప్రతి టేబుల్ వద్ద ఉన్న వేరే బాక్స్‌లో వేస్తారు. వాటిని రిటర్నింగ్ అధికారి, అభ్యర్థి, ప్రధాన ఏజెంట్ సమక్షంలో పరిశీలిస్తారు. చెల్లుబాటు అయ్యే ఓట్లు ఉంటే గుర్తిస్తారు. రెండో మెయిన్ రౌండ్లో మిగిలిన ఓట్లను మొదటి ప్రక్రియ మాదిరిగానే లెక్కిస్తారు. మిగిలిన ఎన్నికలకు భిన్నంగా ప్రిఫరెన్సియల్ ఓటింగ్ విధానంలో జరిగే ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో పాటు, అవసరమైనపుడు బదిలీ ద్వారా తదుపరి ప్రాధాన్యతా ఓట్లకు కూడా లెక్కిస్తారు. మొత్తం పోలైన ఓట్లలో వాయిలిడ్ ఓట్లను రెండుతో భాగించగా వచ్చిన సంఖ్యకు ఒకటి కలిపి విజేతను నిర్ణయించేందుకు అవసరమైన కోటా సంఖ్యను నిర్ధారిస్తారు. ఒక అభ్యర్థికి నిర్దేశిత కోటా సంఖ్య ఓట్లు వచ్చే వరకూ ఎలిమినేషన్ రౌండ్లు నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

7 గంటల పాటు కౌంటింగ్

ఈ సారి ఐదుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. 15,502 ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో లెక్కింపునకు దాదాపు 7 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. ఓట్లను కట్టలు కట్టడానికి 4 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. అంటే ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కట్టలు కట్టే ప్రక్రియ జరుగుతుంది. ఆ తర్వాత మొదటి రౌండ్ ఫలితం మధ్యాహ్నం 2 గంటల లోపే తెలిసే అవకాశం ఉంది. మొత్తం ఫలితాలు తెలియాలంటే సాయంత్రం 4 గంటల వరకూ సమయం పట్టే అవకాశం ఉంది. అయితే మొదటి రౌండ్ లోనే మొదటి ప్రాధాన్యత ఓట్లలో స్పష్టత వస్తే విజేత ఎవరనేది ఒక అంచనా వస్తుందని ఏజెంట్లు చెబుతున్నారు.

గెలిచేదెవరు...?

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరు ఈసారి కూడా అడ్డదారుల్లో విజయం సాధించాలనుకునే వారికి వ్యతిరేకంగా సాగినట్లు కనిపిస్తుంది. బరిలో ఐదుగురు అభ్యర్థులు ఉండగా ప్రధానంగా ఇద్దరి మధ్య పోటీ నెలకొంది. 30 వరకు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపరిచిన పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన పిడిఎఫ్ అభ్యర్థి బొర్ర గోపిమూర్తి, తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన రిటైర్డ్ అధ్యాపకులు గంధం నారాయణరావుల మధ్య ప్రధానంగా పోటీ ఉంది. గతంలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులను ప్రలోభాలకు గురిచేసి గెలవాలని ప్రయత్నాలు జరిపిన కార్పొరేట్ అభ్యర్థులు పరాజయం చెందారు. ఈసారి కూడా అదే సీను పునరావృతం కానుందని విశ్లేషకులు భావిస్తున్నారు. నిరంతరం ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై పోరాటాలు జరపడమే కాకుండా వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సాబ్జీకు ఎక్కువ మద్దతు దక్కిందని, ఇప్పుడు అదే మద్దతు పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తికి దక్కుతుందని భావిస్తున్నారు.

స్ట్రాంగ్ రూంను సందర్శించిన ఎస్‌పి

జెఎన్‌టియుకెలోని బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను ఆదివారం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు భద్రతా చర్యలను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కరప మండంలోని రైసు మిల్లులో తనిఖీలు చేస్తున్న జెసి రాహుల్‌మీనా

రైస్ మిల్లుల్లో జాయింట్ కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - కరప, సామర్లకోట

జిల్లాలో పలు రైస్ మిల్లులను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదివారం తనిఖీలు చేశారు.. కరప మండలంలోని గొడ్డటిపాలెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ రైస్ మిల్లును జెసి రాహుల్ మీనా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో రికార్డులను పరిశీలించారు. రైతు సేవ కేంద్రాల్లో జనరేట్ చేయబడిన ట్రక్ ప్రభుత్వం ద్వారా రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు ఏ విధంగా చేస్తున్నారు? మిల్లుకు ఏవిధంగా తీసుకొస్తున్నారు? ఎంత ధరను నిర్ణయిస్తున్నారు? అవంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుకు చేరుకున్న తర్వాత రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కూలీల కొరత లేకుండా దిగుమతిని వేగంగా చేసేలా చర్యలు తీసుకోవాలని, సాంకేతికంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తున తక్షణమే హెడ్ ఆఫీస్, కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎం.దేవులా నాయక్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, తహాశీల్దార్ ఎన్.సత్యనారాయణ, ఎఒ ఎవి.రాజేష్, ఇతర రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట మండలం ఉండూరు గ్రామంలోని దేవి రైస్ మిల్లును జెసి తనిఖీ చేశారు. రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని తరలించే క్రమంలో ఓచర్ల ఇబ్బందులను తదితర టెక్నికల్ విషయాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో తహాశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇగ్నో శిక్షణతో ఉన్నత ఉద్యోగాలు

ప్రజాశక్తి - కాకినాడ

ఇగ్నో స్టడీ సెంటర్లో శిక్షణ ద్వారా ఉన్నత ఉద్యో గాలు సాధించొచ్చని స్టడీ సెంటర్ ఇన్‌ఛార్జ్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక ఐడియల్ కాళాశాల పీజీ కోర్సుల విభాగంలో ఉన్న ఇగ్నో స్టడీ సెంటర్లో ఈ ఏడాది జూలైలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు పరిచయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉన్నత ప్రమాణాలతో నడుస్తున్న ఏకైక విశ్వవిద్యాలయం అని అన్నారు. ప్రస్తుతం ఉద్యోగం చేస్తూ ఉన్నత స్థాయికి వెళ్లాలనుకునేవారు ఈ విశ్వ విద్యాలం అందిస్తున్న సర్టిఫికెట్, డిగ్రీ, డిప్లమో, పీజీ, పీజీ డిప్లమో, ఎంబిఎ, ఎంసిఎ వంటి కోర్సులలో ఉపయోగపడే కోర్సులు ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు. ప్రవేశాలు, పరీక్ష ఫీజు, స్టడీ మెటీరియల్ కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సామాజికవర్గాల వారికి డిగ్రీ స్థాయిలో ఫీజులు ఉండవన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మాట్లా డుతూ ఎంతో ప్రామాణికమైన ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో చేరి కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు మంచి స్థితిలో స్థిరపడే అవకాశం ఉందన్నారు. ఇగ్నో ప్రస్తుత అవసరాలకు అనుగుణమైన 300కు పైగా కోర్సులు ఆఫర్ చేస్తున్నదని అన్నారు. ఎంతో ప్రామాణికమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నా రని, పోటీ పరీక్షలకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు మాట్లాడుతూ దేశంలోనే ఎంతో ప్రాచుర్యం పొందిన ఇగ్నోలో చేరడం ద్వారా ఎక్కువ జ్ఞానం సంపాదించుకోవచ్చునని అన్నారు. ఏడాదికి 2 సార్లు ప్రవేశాల ప్రక్రియ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సెలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో నటి శ్రీలీల సందడి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో సినీ నటి శ్రీలీల సందడి చేశారు. ఆమె రాక కోసం ప్రేక్షకులు, అభిమానులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఆమె ఆదివారం కాకినాడ మెయిన్ రోడ్లో జెసి మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షాపింగ్ మాల్ మూడంతస్తులు తిరిగి వివిధ రకాల చీరలు, వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం శ్రీలీల మాట్లాడుతూ కాకినాడ రావడం తనకు చాలా సంతోషంగా ఉందని, గతంలో కూడా ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. షాపింగ్ మాల్ సందర్శించానని ఇక్కడ రకరకాల ఉత్పత్తులు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ప్రత్యేక తగ్గింపులు సరసమైన ధరలు అందిస్తున్న షాపింగ్ మాల్లో దుస్తులు కొనుగోలు చేయాలని సూచించారు. నటి శ్రీలీలను చూసేందుకు ప్రేక్షకులు అభిమానులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జెసి మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీనటి శ్రీలీల

సెజ్‌పై బహిరంగ చర్చకు రావాలి: వర్మ

ప్రజాశక్తి - పిఠాపురం

కెఎస్ఈజెడ్ వ్యవహారంపై వైసిపి నేతలు బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎంఎల్ఎ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ సవాల్ చేశారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెజ్ వ్యవహారంపై వైసిపికి చెందిన మాజీ మంత్రులు కన్నబాబు, దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ వంగా గీత చేస్తున్న విమర్శలు సరికావని అన్నారు. వాస్తవంగా కాకినాడ సెజ్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలోనిదేనన్నారు. నాడు వైఎస్ఆర్ చేసిన పాపం సెజ్ రైతులకు శాపంగా మారింద న్నారు. లేని, రాని కంపెనీలను ఎరగా చూపించి భూములు కాజేశారని ఆరోపించారు. వైసిపి పాలనలో మంత్రులు, ఎంఎల్ ఎలు కాకినాడ సేజ్ భూముల్లో రైతులను ముంచారన్నారు. గతంలో చంద్రబాబు రైతులకు ప్రయివేటు కంపెనీల ద్వారా పరిహారం ఇప్పించారన్నారు. అధికారంలోకి వస్తే సెజ్ రైతులకు భూములు వెనక్కి తిరిగి ఇచ్చేస్తామని కమిటీ వేసి సెజ్ రద్దు చేస్తామన్న జగన్ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాకి నాడ సెజ్ భూములపై సిబిఐ, ఇడి విచారణ కోరుతున్న వైసిపి నేతలు, వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కూడా సిబిఐ విచారణకు సిద్ధంగా ఉండాలన్నారు. సోమవారం పట్టణంలోని ఉప్పాడ బస్టాండ్ సెంటర్ లో అన్ని ఆధారాలతో బహిరంగ చర్చకు తాను సిద్ధం అని, టిడిపి ప్రభుత్వ హయాంలో అవినీతి పాల్పడ్డారని విమర్శిస్తున్న వైసిపి నేతలు ఆధారాలతో వచ్చి ప్రజలు, మీడియా సమక్షంలో బహిరంగ చర్చలో పాల్గోవాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎస్.గంగాధర్, నల్లా శ్రీను, కె.శ్రీను, ఎన్.ప్రకాష్, బంగారు బాబు, నామా దొరబాబు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

క్రీడాకారులతో మాట్లాడుతున్న సిఐ వైఆర్‌కె శ్రీనివాస్

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సిఐ వైఆర్‌కె. శ్రీనివాస్ సూచించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆటలు ఆడుతున్న విద్యార్థులతో సిఐ మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నతంగా చదువకుంటే భవిష్యత్ ఉంటుందని అన్నారు. తద్వారా అందరిలో గౌరవం పెరుగుతుందని అన్నారు. అందుకు ఉదాహరణ నేనే అని అన్నారు. నేను ఆ రోజు చదువుకోవడం వల్లే ఈ రోజు మీ ముందు ఇలా మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

రెవెన్యూ భవనాన్ని ప్రారంభించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

కాజ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డైలీ మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన రెవెన్యూ భవనాన్ని ఆర్‌డిఒ శ్రీరమణి ఆదివారం ప్రారంభించారు. అదే సంస్థ లూథరన్ హైస్కూల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న రెండు అంతస్తుల రెడ్ క్రాస్ పెద్దాపురం బ్రాంచ్ కార్యాలయ నిర్మాణానికి ట్రస్ట్ ఛైర్మన్ కాజ రాజేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో 30 మంది గర్భిణులకు రూ.30 వేల ఖర్చుతో ఆరోగ్య సామగ్రిని మిషన్ అన్నపూర్ణ సహాయనిధి, మన పెద్దాపురం ఫేస్‌బుక్ గ్రూప్, రోటరీ క్లబ్ పర్యవేక్షణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ పెద్దాపురంలో నివసించి హైదరాబాదులో స్థిరపడిన తమ కుటుంబం ఆధ్వర్యంలో తమ తండ్రి కాజా నరసింహమూర్తి పేరున చారిటబుల్ ట్రస్టు స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ తండ్రి నరసింహమూర్తి శతజయంతి ఉత్సవాల సందర్భంగా పెద్దాపురంలో ఈ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తాను మహారాణి కళాశాలలో చదువుకున్నానని, తాను చదువుకున్న కళాశాలకు రూ.35 లక్షలు గతంలో దానం చేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప, కుడా ఛైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, వివిఆర్.వర్మ, కెఆర్ఎస్‌కె.చౌదరి, విశ్రాంత అధ్యాపకులు ముస్తఫా, ఆర్.ప్రభాకర్ రావు, జె.రమేష్, దేవత.రాజేష్ కుమార్, పెద్దిరెడ్డి నరేష్ పాల్గొన్నారు.

కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ శ్రీరమణి

10 నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు

ప్రజాశక్తి - కాజులూరు

ఈ నెల 10వ తేదీ నుంచి మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో రెవెన్యూ గ్రామ సదస్సులను నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో నిర్వహించిన డ్రోన్ సర్వేలో దొర్లిన తప్పులను సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సులను నిర్వహిస్తుందని తెలిపారు. పేర్లు మార్పులు, సర్వేనెంబర్ మార్పులు, భూముల హెచ్చు తగ్గులు వంటి వాటిని సరి చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించి పూర్తి వివరాలతో సదస్సులు పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సదస్సుల్లో తప్పనిసరిగా మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొంటారని, పరిష్కారం అయ్యే వాటిని అక్కడికక్కడే లోపాలను సరిదిద్దడం జరుగుతుందని ఆయన తెలిపారు.

బాధితురాలికి చెక్కును అందిస్తున్న తాజుద్దీన్, ఇతరులు

ఖిద్మాత్ కమిటీ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో కులమతాలకు అతీతంగా ఖిద్మాత్ కమిటీ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని టిడిపి నాయకులు ఎండి తాజుద్దీన్ కొనియాడారు. స్థానిక రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఫ్రిజ్ పేలిపోయిన ప్రమాదంలో గాయాలపాలైయిన ఐశ్వర్యకు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయాన్ని అందించారు. కమిటి అధ్యక్షులు షేక్ చిష్టి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువతికి మెరుగైన వైద్య అవసరం అయితే సిటి ఎంఎల్ఎ వనమాడి కొండబాబు దృష్టికి తీసుకెళ్లి వైద్య సాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి కార్యదర్శి హుస్సేన్, కమిటి ఫౌండర్ అధ్యక్షులు హుస్సేన్ షరీఫ్, కమిటి సభ్యులు ఫక్రురువుద్దీన్ ఆలీ, ఎహతైషాముద్దీన్, యువతి కుటుంబ సభ్యురాలు చంద్రకళా పాల్గొన్నారు.

మతపరమైన వివరాలు సేకరించడం తగదు

ప్రజాశక్తి - కాకినాడ

మత ప్రాతిపదికన ముస్లిం, క్రిస్టియన్ ఇతర మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లల వివరాలను ప్రభుత్వం సేకరించడం రాజ్యాంగ విరుద్ధమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదవారం ఓ ప్రకటనలో అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో కూటమి ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా ఐసిడిఎస్ ద్వారా మత ప్రాతిపదికన మైనారిటీ పిల్లల గణన చేపట్టడం సముచితం కాదన్నారు. 2014 నుంచి 2023 మధ్య కాలంలో పుట్టిన ముస్లిం, క్రిస్టియన్, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లల వివరాలు సేకరించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కుల గణన డిమాండ్‌ను వ్యతిరేకించిన ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా మత పరమైన వివరాలు సేకరించడం వెనుక అజెండాను బయట పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తలపెట్టిన సేకరణ వలన మత ఉద్రిక్తతలు పెంచడానికి పిల్లల తల్లుల్లో భావోద్రేకాలు రెచ్చగొట్టేందుకు తోడ్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

నేటి పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని వివిధ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల 9వ తేదీన సోమవారం అనివార్య కారణాలవల్ల రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలన్నారు.

కార్టూ'నిజం'



ఆకట్టుకున్న అంబేద్కర్ నాటకం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో హైదరబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ప్రదర్శించిన అంబేద్కర్ జీవిత చరిత్రపై నృత్య కళారూపక నాటకం చూపరులను ఆకట్టుకుంది. గ్రామంలోని కెవిఎస్ కన్వెన్సన్ హాల్లో జరిగిన ఈ ప్రదర్శనకు ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, సర్పంచ్ ముద్దన వెంకటశివరామప్రసాద్, అత్తిలి బాబురావు, విళ్ళ వీర తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులు అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలన్నారు. సామాజికంగా అన్ని కుల, మత, వర్గాలు కలిసి ఉండాలని భారత రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ అందరికీ సమాన హక్కులు ప్రసాదించారన్నారు. ఏదో ఒక కులానికి అంబేద్కర్ నాయకుడు కాదని అంబేద్కర్ అందరివాడని గుర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన అంబేద్కర్ నాటకం ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు దున్న రాంబాబు, మాజీ ఎంపిటిసి మల్లాడి వరదరాజు, కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు విప్పర్తి శ్రీనివాస్, పులపకూర కృష్ణ, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పెయ్యల రమేష్, మాలమహానాడు మండల అధ్యక్షులు దున్న మురళి, న్యాయవాది యడ్ల కుటుంబరావు, దడాల సువర్ణలత, వెంకటరమణ, మట్టపర్తి గణేష్, నారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవిత చరిత్రపై నృత్యరూపక నాటకంలో ఒక సన్నివేశం

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గంపేటకు చెందిన వారా లోవరాజు ఏలేశ్వరం విద్యుత్ శాఖలో పని చేస్తున్నాడు. జగ్గంపేట నుంచి రామవరం వెళ్తుండగా రామవరం జాతీయ రహదారి దాటుతుండగా తుని నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లోవరాజు తలకు బలమైన గాయం అయింది. స్థానికులు అతన్ని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి నరేంద్ర పట్నం గ్రామంలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారికి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ఆనందరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఉన్న బుచ్చాలమ్మ చెరువులో వ్యక్తి మతదేహాన్ని నల్లజర్ల పోలీసులు గుర్తించారు. సిఐ నక్క శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని తూర్పు చోడవరం గ్రామానికి చెందిన మద్దిపాటి సూరిబాబు(63) శనివారం రాజమహేంద్రవరంలో ఓ శుభకార్యానికి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలించారు. నల్లజర్ల పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ముత్యాలమ్మ చెరువు గట్టుపై బైకును, చెప్పులను గుర్తించారు. దీంతో చెరువులో గాలించగా సూరిబాబు మృతదేహం లభ్యమైంది. బహిర్భూమికి వెళ్లి కాలుజారి పడిపోయినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై కత్తితో దాడి

ప్రజాశక్తి - నల్లజర్ల

కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్న వ్యక్తిని ప్రశ్నించినందుకు మహిళపై యువకుడు కత్తితో దాడికి దిగాడు. ఈ ఘటన నల్లజర్ల అంబేద్కర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది స్థానికులు బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన గుర్రాల రాజు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి ఆదివారం మధ్యాహ్నం 1:30 ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న గుర్రాల రాజు వద్దకు వెళ్లి ప్రశ్నించింది. దీంతో ఆగ్రహానికి గురైన రాజు తన వద్ద ఉన్న కత్తితో మహిళపై దాడి చేశాడు. వెంటనే స్థానికులు ఆమెను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

రైలు ఢీకొని గుర్తుతెలీని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్ గూడ్స్ యార్డ్ వద్ద రైలు ఢీకొని 30 నుంచి 35 సంవత్సరాల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందినట్లు సామర్లకోట రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే ఎస్ఐ పి.వాసు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతుని వంటిపై బూడిద రంగు అడ్డగీతలు గల టీ షర్టు, నీలం తెలుపు చారలు గల తువాలు ధరించి ఉన్నాడు. మృతుని చేతిపై టి.నాగేశ్వరరావు, లోవ అని పేర్లు పచ్చబొట్టుతోపాటు మెడకుడివైపు తేలు బొమ్మ ఆకారం పచ్చబొట్టు, కుడి దండమీద సూర్యుడు బొమ్మ గల పచ్చబొట్టు, ఎడమ చేతి మీద పాము ఆకారం గల పచ్చబొట్టు ఉన్నట్లు వివరించారు. మృతిని సంబంధికులు ఎవరైనా ఉంటే సామర్లకోట రైల్వే ఎస్ఐను 8555856876లో సంప్రదించాలన్నారు.

భీమరాజును సత్కరిస్తున్న ఎస్.యానాం గ్రామస్తులు

లంకే భీమరాజుకు సత్కారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్.యానాంకు చెందిన మాజీ సర్పంచ్ లంకే భీమరాజు ఇటీవల రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్.యానాంలో ఆదివారం డైరెక్టర్ భీమరాజును గ్రామానికి చెందిన అయితాబత్తుల అజయ్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. భీమరాజుకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. పదవి ద్వారా పార్టీ అభివృద్ధికి, అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలచోళ్ల బుజ్జి, నారాయణరావు, కోటిపల్లి రాజు, మాగాపు శ్రీను, అయితాబత్తుల అజయ్ సింగ్, మీరాకుమార్, నాగ ప్రసాద్, ఉండ్రు శామ్యూల్, పొలమూరి సురేష్, బూల ప్రసాద్, రేవు స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం ఈ నెల 9నఉదయం 10 గంటలనుండి యథావిధిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండల స్థాయిలో కూడా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

'పది' పరీక్షలకు 100 రోజుల ప్రణాళిక

ప్రజాశక్తితో పాఠశాల విద్యా రీజినల్ డైరెక్టర్ నాగమణి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని, పిల్లలను సరైన మార్గంలో పయనింప జేసేందుకు పక్కా ప్రణాళికతో విద్యా వ్యవస్థలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చిందని పాఠశాల విద్య రీజనల్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా 100 రోజుల ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏ విధంగా ఉంటుంది.?

కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, జడ్‌పిహెచ్ఎస్, కెజిబివి, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఎపి రెసిడెన్షియల్ పాఠశాలల్లో 18,300 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో బాలురు 8,700 మంది బాలికలు, 9,600 ఉన్నారు. విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తాం. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాం. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సంఖ్య పెంచుతాం. పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తాం. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తాం.

యాక్షన్ ప్లాన్ అమలు ఎలా ఉంది...

సమ్మెటివ్ పరీక్షల అనంతరం విద్యార్థులను, పాఠశాలలను, మండలాలను గ్రేడులుగా విభజించాం. ఉదయం 9గంటల నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయి. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టులు, మండలాల వారీగా సమీక్షలు, తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహిస్తున్నాం. డిసెంబరు 1న ప్రారంభించిన ఈ ప్రణాళికను మార్చి 10 వరకూ అమలు చేస్తాం. విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత, అధికమార్కులు సాధించేలా ఈ ప్రణాళికను ఈనెల 1 నుంచి అన్ని పాఠశాలల్లో అమల్లోకి వచ్చింది. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలకు స్టేట్ సిలబస్ ఆధారంగానే పరీక్షలకు హాజరు కానున్నారు. గతంలో డిసిఇబి ద్వారా ప్రణాళిక రూపొందించి ఇచ్చేవారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలోనే తయారు చేసిన పరీక్ష ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందిస్తాం.

స్టడీ హావర్స్ నిర్వహణ

ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ 6 పీరియడ్లు, స్టడీ హావర్స్ నిర్వహిస్తున్నాం. ఆరో పిరియడ్‌లో విద్యార్థులకు పరీక్షను నిర్వహించాలి. స్టడీ హావర్స్ పాల్గొనే ఉపాధ్యాయులకు ప్రత్యేక సిసిఎల్ మంజూరు చేస్తాం. ప్రతిరోజూ సబ్జెక్ట్ నిపుణులు తయారు చేసిన ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని సంబంధిత విద్యార్థులతో పరీక్ష రాయిస్తున్నాం. ఈనెల 9 నుంచి ఎస్ఎ-1 పరీక్షలు జరుగుతాయి. వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థి స్థాయిని నిర్ణయిస్తారు. ఎబిసిడిలుగా విభజించి చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. ఇప్పటివరకూ నిర్వహించిన అంతర్గత పరీక్షల మార్కుల వివరాలను ఈనెల 7న నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో అందిస్తారు. దీని కోసం ప్రభుత్వం హోలి స్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ప్రింట్‌చేసి ఇప్పటికే సరఫరా చేసింది. తరగతిలోని 6నుంచి 8మంది విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసుకుంటారు. అలా తీసుకున్న విద్యార్థులు ఉత్తమమైన మార్కులు సాధించేందుకు అవసరమైన మెళకువలను నేర్పుతారు.

న్యాయవాదులకు 'ఐలా' అండ

ప్రజాశక్తి - తొండంగి

న్యాయవాద హక్కులను సాధించేందుకు ఐ లాజ్ అండగా నిలుస్తుందని ఐలా జాతీయ ప్రధాన కార్యదర్శి క్రిస్టన్ జి రోజారియా అన్నారు. ఆదివారం స్థానిక శేషాద్రి సదన్‌లో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జస్టిస్ ఐలాజ్ నిర్వహించిన మొదటి రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రెండేళ్ల నుంచి మహిళలపైన, న్యాయవాదులపైన జరుగుతున్న దాడులు అధికం అయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకై ఐలా పెద్దఎత్తున పోరాటం సాగించిం దన్నారు. న్యాయవాద వృత్తిలో దళిత, ఆదివాసి, మైనార్టీలకు తగిన ప్రాధాన్యత కొనవడిందని అన్నారు. 60 ఏళ్లు దాటిన న్యాయవాదులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలపై కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులకు సౌకర్యాలు, ప్రయోజనాలకై రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయ విద్య చదువుతున్న విద్యార్థులకు కనీస వసతులు కల్పిం చాలని, మానవ హక్కులు, పౌర హక్కులు కోసం పోరాడిన న్యాయ వాదులపై ప్రభుత్వాలు నిరంకుశ నల్ల చట్టాలు ప్రయోగించడం ఆపాలని, న్యాయ వాదులపై జరుగుతున్న దాడు లను అరికట్టాలని డిమాండ్ చేశారు.

సభలో మాట్లాడుతున్న క్రిస్టన్ జి రోజారియా

15 మందితో నూతన కమిటి ఏకగ్రీవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కమిటీ 15 మందితో ఏకగ్రీవంగా ఎంపికైంది. రాష్ట్ర అధ్యక్షులుగా రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా బుగత శివ, జాయింట్ సెక్రెటరీగా ఉదయ్ కిరణ్, కోశాధికారిగా అవసరాల దేవితోపాటు, ఇతరులు కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

స్థానిక అయోధ్యరామపురం బొచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తోటకూర సాయిరామకృష్ణ, ఎంఇఒ-1 వై.శివరామకష్ణయ్య చెప్పారు. కేంద్రానికి 312 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సివుండగా, 288 మంది హాజరు అయ్యారని తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారిగా టి.శ్యాంసుందర్ వ్యవహరించారు. పరీక్ష కేంద్రాన్ని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ రాజశేఖర్, డిసిఇబి సెక్రెటరీ ఎం.వెంకట్రావు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జడ్‌పి బాలికొన్నత పాఠశాలలో 264 మందికి గాను 249 మంది హాజరైనట్టు చీఫ్, హెచ్ఎం యు.మీనా మాధురి తెలిపారు. అలాగే పెద్దాపురం మండల పరిధిలో నాలుగు కేంద్రాల్లో ఆదివారం జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు 994 మంది హాజరయ్యారని ఎంఇఒ చౌదరి తెలిపారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 312 మందికి 285 మంది, జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో 240 మందికి 236 మంది, నారాయణ స్కూలులో 264 మందికి 250 మంది, సాగర్ మున్సిపల్ హైస్కూల్లో 240 మందికి 223 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. మొత్తం 1056 మందికి 994 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు.

పరీక్ష విధానాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

నీటి సంఘాల ఎన్నికల ఏకగ్రీవానికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

నీటి సంఘాల ఎన్నికల్లో పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎంపిక అయ్యేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు కృషి చేయాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం స్థానిక సుధా కాలనీలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి టిడిపి కార్యకర్తలు నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సంఘాలు ఎన్నికలకు సంబంధించి కూటమి నాయకులందరితో చర్చించి అన్నిచోట్ల ఏకగ్రీవాలు జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తిమ్ వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, పాలకుర్తి శ్రీనివాసాచార్యులు, కంటే బాబు, రేలంగి వెంకటరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఆకట్టుకున్న బాలల సభ

ప్రజాశక్తి - సామర్లకోట

అంగర లక్ష్మీ కాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మాధవ పట్నంలో నిర్వహిస్తున్న బాల మందిరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన బాలలసభ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు ఇన్ డోర్ గేమ్స్‌లో పాల్గొన్నారు. బాలల కోసం బాలలే రూపొందించుకొంటున్న 'చిట్టి ఊహలు' త్రైమాసిక పత్రిక ఎడిటోరియల్ టీమ్ రచనలు ఎడిటింగ్ చేశారు. బాలసాహిత్యం పుస్తకాలు చదివారు. సమీక్షలు జరిపారు. ఒరిగామి అంశాలపై విద్యార్థులు చురుగ్గా పాల్గొని కాగితాలతో వాల్ హేంగింగ్స్ తయారుచేసి ప్రదర్శించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు అంగర గోపాలకృష్ణ బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకున్న బాలికలు

వైద్య సేవలు అందిస్తున్న డిఎంహెచ్ఒ నాయక్

హోప్ ఐలాండ్‌లో వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని హోప్ ఐలాండ్ గ్రామంలో ఆప్రా స్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు ఈశ్వర్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో డిఎంహెచ్ఒ డాక్టర్ నరసింహ నాయక్, అప్రా స్కాన్ సంస్థ అధ్యక్షులు, వైద్యులు డివి.కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. వీరిలో 10మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించామని, బాధితులకు మందులతోపాటు నులిపురుగుల నివారణ మందులను అందజేసినట్లు డిఎంహెచ్ఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు ఆంజనేయులు, త్రిమూర్తులు, రమేష్ పాల్గొన్నారు.

తేమ పేరుతో ధాన్యం కొనుగోళ్లు ఆపొద్దు

ప్రజాశక్తి - పెద్దాపురం

తేమ శాతం, ఇతర కారణాలతో రైస్ మిల్లుకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెనక్కి పంపించకూడదని ఆర్‌డిఒ శ్రీరమణి ఆదేశించారు. ఆదివారం ఆమె స్థానిక ఎడిబి రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లును సందర్శించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చిన ధాన్యం కొనుగోలు వాహనాలను ఇతరేతర కారణాలతో వెనక్కి పంపవద్దన్నారు. ఆలస్యం లేకుండా అత్యంత ప్రాముఖ్యత ఇచ్చి వెంటనే ధాన్యాన్ని దింపుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.



వెంకటేశ్వర రైసు మిల్లులో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పెదబ్రహ్మదేవంలో శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు టి.గంగాధర్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని భావించి ఉడతా భక్తిగా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు తెలుగుంట్ల నరసింహారావు, తోటకూర శ్రీనివాసు, జి.శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-రావులపాలెం

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలిచే పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులతో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కార్యకర్తలకు వారి కుటుంబ సభ్యుల పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసాగా ఉండేందుకు సభ్యత్వం చాలా ముఖ్యమని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం రూ.100 చెల్లించి తీసుకుంటే 5 లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువుకి ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు వంటి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ కుటుంబ సభ్యులంతా కలిసి కృషి చేయాలని సత్యానందరావు సూచించారు.

క్విజ్ పోటీల్లో ఉండూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

రిలయన్స్ ధీరు భాయి అంబానీ జిల్లా స్థాయి పోటీల్లో మండలంలోని ఉండూరు జడ్‌పిఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. కాకినాడలో జరిగిన ఈ పోటీల్లో ఉండూరు విద్యా ర్థులు బోనం సుధీర్‌కుమార్, ఉప్పల వెంకట గీతామాధురి ద్వితీయ స్థానాల్లో నిలిచారని హైస్కూల్ హెచ్ఎం.జాన్ ప్రసాద్ చెప్పారు. విజయం సాధించిన విద్యార్థులను హెచ్ఎంతోపాటు, ఎస్ఎంసి ఛైర్మన్ కొప్పల శ్రీనివాస్, కొప్పిరెడ్డి ప్రసాద్, చక్కని ప్రభాకర్ రావు అభినందించారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

అన్నదాన పథకానికి బియ్యం అందజేత

ప్రజాశక్తి -సఖినేటిపల్లి

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి భీమవరం వాస్తవ్యులు ఆకుల అభిజిత్ కుటుంబ సభ్యులు రూ.40 వేల విలువచేసే బియ్యం బస్తాలను ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులు తొలుత స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులకు బియ్యం బస్తాలను అందజేశారు. వారిని ఆలయ అధికారులు అభినందించారు.

బాలాజీ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం పలువురు విరాళాలు అందజేశారు. రాజోలుకు చెందిన చెల్లింగి భానుమూర్తి, లక్ష్మీ ప్రసన్న దంపతులు రూ.16,509, అమలాపురం వాసులు బొక్కా వెంకటేశ్వరరావు, సంధ్యారాణి దంపతులు రూ.10 వేల విరాళాలుగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రాలతో సత్కరించగా ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు.

దాతకు చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికులు అందరికీ ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి పర్యవేక్షణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు ఐవి.ప్రసాద్‌వర్మ, ఎన్‌వి.శాస్త్రి, శంకర్‌శాస్త్రి, ఆశాధులు రాయ విజయ్‌కుమార్, రాయ రామచంద్రప్రసాద్, సిబ్బంది వెంకటరమణ, వరహాలు, లోవ, శివ పాల్గొన్నారు.

భోజనాలు చేస్తున్న యాత్రికులు

మురారి తీర్థం ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

ఈ నెల 17న జరిగే మురారి తీర్థం బందోబస్తుపై ఎస్ఐ శివనాగు ఆదివారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఆలయ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. తీర్థంలో శాంతిభద్రతలకు సంబంధించి ఎటువంటి లోపం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ఆలయ కమిటీ చర్యలు తీసుకోవాలని, యాత్రికులకు అవసరమైన ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఆలయం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ శివనాగు

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 2,473 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆదివారం నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్)కు 2,473 మంది హాజరయ్యారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ జిల్లాలో 13 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు 2,742 మందికి 2,473 మంది హాజరయ్యారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు.

GENERAL NOTICE TO PUBLIC

IN THE COURT OF THE IVth ADDITIONAL DISTRICT JUDGE AT KAKINADA

O.P. NO.91 of 2024

(IN THE MATTER OF APPOINTMENT OF THE GUARDIAN OF MINOR, VENNA DEVI, AGE.13YEARS, DAUGHTER OF LATE.VENNA SATYAVATHI AND VENNA SIVA Alias SIVAYYA)

Between:
1. Venna Siva Alias Sivayya
2. Venna Naga Venkata Swamy

...Petitioners

AND

Nill **...Respondent**

In the above case proceedings, Petitioner`s have sought permission of court to dispose off the 1/3rd .undivided and unspecified share fraction of interest of above mentioned minor daughter in the schedule of property detailed hereunder, which total site and house property is already under dischargeable encumberance with CANARA BANK, SME BRANCH, Kakinada, since contracted loan by deceased mother of minor. If anyone is having any objection in this regard, can appear **on 18-12-2024 at 10.30 A.M** onwards before above court either in person or through advocates and offer such of objections in may be submitted by presenting in writing. Else, the court will proceed with case further. Hence the general public are notified in this behalf.

SCHEDULE OF PROPERTY

Registered Sale Deed Doct.No.488/2003, SRO-Samalkota, Formerly within the limits of East Godavari District, Presently within the limits of Kakinada District, Kakinada Rural Mandal, SRO-Samalkota, Panduru Village and Gram Panchayat Limits, Gramakantam S.No.248, from out of an extent of Ac.0.85 cents, an extent of 163 Sq.yards = 136.92 Sq.mts., of vacant site comprised in two items is bounded by the following boundaries and measurements as under:-

Item-1:- An extent of 82 Sq.yards
EAST: Ft.27.0 Site in Item-2 Property. **SOUTH:** Ft.27.06 Site of Valavala Suryanarayana. **WEST:** Ft.27.0 Ft.10 Wide Way. **NORTH:** Ft.27.06 Site sold to Padala Subbalakshmi by vendors on this even day.

Item-2:- An extent of 81 Sq.yards
EAST: Ft.19.0 Site of Kanda Yesubabu. **SOUTH:** Ft.38.06 Site of Valavala Suryanarayana. **WEST:** Ft.22.06 Site in Item-1 Property. **NORTH:** Ft.32.0 Site sold to Padala Subbalakshmi by vendors on this even day.

Within the above boundaries Item No's.1 and 2 makes together to a tune of a total extent of 163 Sq.yards of vacant site, with all common ways, water ways and with all easement rights attached thereto.

//BY ORDER OF COURT//

BHAMIDIPATI VENKATA RAMASARMA
DEVARAKONDA V.S.S.SUJANA
ADVOCATES, DNO.25-4-50/1,
BESIDE TEMPLE STREET
DT.07.12.2024 KAKINADA-533 001